ప్రజాశక్తి
శనివారం 24 ఆగస్టు 2024 | 5 | అనంతపురం

స్ఫూర్తినీయుడు 'టంగుటూరి'

కలెక్టరేట్‌లో జయంతి వేడుకలు

టంగుటూరి ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వాతంత్ర్య పోరాటంలో ధైర్యసాహసాలు, ప్రజాపాలనలో ముందు చూపు ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటి యువతకు స్ఫూర్తినీయం అని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ తెలిపారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఇన్‌ఛార్జి కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఒక మారుమూల గ్రామం నుంచి సాధారణ వ్యక్తిలా వచ్చిన టంగుటూరి దేశం గుర్తించే నేతగా ఎదిగాడన్నారు. మద్రాసులో సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని తుపాకి గుండుకు తన గుండెను ఎదురొడ్డి స్వేచ్ఛా స్వతంత్రాల కోసం గర్జించిన పోరాట వీరుడన్నారు. అలాంటి వ్యక్తిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని మెరుగైన సమాజం కోసం పాటుపడాలన్నారు. అనంతరం అనంతపురం, నార్పల బీసీ ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.రామకృష్ణారెడ్డి, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారిని సుభాషిని, కలెక్టరేట్ ఏవో జి.మారుతి, డిఐపిఆర్ఒ పి.గురుస్వామి శెట్టి, అధికారులు పాల్గొన్నారు.

గార్లదిన్నెలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ

పల్లె ప్రగతికి గ్రామసభ

- జిల్లా వ్యాప్తంగా కొనసాగిన గ్రామసభలు
- గ్రామస్తుల సమక్షంలో పనుల ఎంపిక

పల్లె ప్రగతి కోసం గ్రామసభల నిర్వహణ కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభలు శుక్రవారం నాడు జిల్లాలోని అన్ని గ్రామాల్లో కొనసాగాయి. ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమాల్లో జిల్లా, మండల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజల సమక్షంలో గ్రామసభలను నిర్వహించి ఉపాధి పనుల ఎంపిక, గ్రామాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై బహిరంగంగా చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు గ్రామాభివృద్ధి కోసం చేసిన సూచనలను అధికారులు వినతిపత్రాల రూపంలో స్వీకరించారు.

సమస్యలు లేని గ్రామాలుగా మార్చుకుందాం : ఇన్‌ఛార్జి కలెక్టర్

గార్లదిన్నె : గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి సమస్యలు లేని గ్రామాలుగా అభివృద్ధి చేసుకోవడమే గ్రామసభల ఉద్దేశమని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. గార్లదిన్నె మండలం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలకు సంబంధించి శ్మశానవాటిక దారులు, వాటి పునరుద్ధరణ, సిసి రోడ్ల సదుపాయం, పింఛన్లు, నూతన రేషన్ కార్డులు, వీధి దీపాలు, నివాసాల మధ్య శుభ్రత, నీటి కొళాయిలు తదితర సమస్యలను చర్చించి గ్రామసభ ఆమోదం తీసుకోవాలన్నారు. గ్రామాభివృద్ధిపై చర్చించి సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో గ్రామ స్వరాజ్య స్థాపనకు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, సర్పంచి సుబ్బమ్మ, డిపిఒ ప్రభాకర్ రావు, ఫిష్ రిష్ డిడి శ్రీనివాస్ నాయక్, తహశీల్దార్ ఈరమ్మ, ఈవోఆర్డీ వెంకటలక్ష్మమ్మ, జెడ్పీటీసీ గుర్రం ఆదినాయుడు, మండల కన్వీనర్ పాండు, పంచాయతి సెక్రటరీ రవిశంకర్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పదునైనా లేని ప్రత్యామ్నాయ విత్తనం..!

- ఇప్పటికీ ఖరారవని ధరలు
- మొదలవని సేకరణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్‌లో కీలకమైన జులై నెలలో వర్షాలు పడలేదు. దీంతో ప్రధాన పంటల సాగు అనుకున్నంత జరగలేదు. అదును దాటక ఇప్పుడు వర్షాలు పడుతున్నాయి. ఈ సమయంలో పంట విత్తుకునేందుకు ప్రత్యామ్నాయ విత్తనాలు అందుబాటులో లేవు. ప్రణాళికలైతే జులై నెలాఖరులనే చేసినప్పటికీ విత్తనం ధర నిర్ణయించకపోవడం, సేకరణ ప్రారంభమవకపోవడంతో విత్తన పంపిణీ జరగలేదు. ఒకవైపు వర్షాలు విస్తారంగా పడుతుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలైనా సాగు చేసుకుందామంటే వీల్లేకుండా ఉంది. ప్రత్యామ్నాయ విత్తనాలు అందుబాటులో లేవు.

5.54 లక్షల ఎకరాలు బీడు

అనంతపురం జిల్లాలో 8.56 లక్షల ఎకరాలున్నాయి. సాధారణ పంటల సాగవుతుందని అంచనా వేస్తే జులై నెలలో తీవ్ర వర్షాభావం నెలకొంది. 3.02 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. తక్కిన సాగుభూమి అంతా బీడుగా ఉంది. 5.54 లక్షల ఎకరాల్లో విత్తనం పడలేదు. ఆగస్టు రెండవ వారం నుంచి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. దీనికి తగ్గట్టు వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించింది. 27,907 క్వింటాళ్లు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఉలవలు 21,791 క్వింటాళ్లు, పెసలు 1501 క్వింటాళ్లు, అలసంద 3253 క్వింటాళ్లు, జొన్నలు 973 క్వింటాళ్లు, కొర్ర 369 క్వింటాళ్లు, మినుములు 90 క్వింటాళ్లు మొత్తం 27907 క్వింటాళ్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటికీ విత్తన ధర నిర్ణయం జరగలేదు. సేకరణ టెండరు ప్రక్రియ వరకే పూర్తయింది. ఇంకా టెండరు ఫైనల్ అయి సేకరణ ప్రారంభమై, పంపిణీకి మరింత సమయం పడుతుంది. అంతలోపు నేలలో తేమ ఆరిపోతే విత్తుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతాయి. మంచి వర్షాలు పడిన సమయంలో విత్తనం పంపిణీ జరిగుంటే బాగుండేదని రైతులు వాపోతున్నారు.

ఆగస్టులో విస్తారంగా వర్షాలు

ఆగస్టులో వర్షాలు విస్తారంగా పడ్డాయి. సాధారణ వర్షపాతం 57.6 మిల్లిమీటర్ల కురవాల్సి ఉండగా 199.7 మిల్లిమీటర్లు పడింది. అంటే సాధారణం కంటే 246 శాతం అధికంగా పడింది. అదే జులై నెలలో చూసినప్పుడు 63.9 మిల్లి మీటర్లకుగానూ 24.4మిల్లీ మీటర్లు పడింది. సాధారణం కంటే 61.8 శాతం లోటుపడింది. అంతకు మునుపు జూన్ నెలలో 61 మిల్లీమీటర్లకుగానూ 147.7 మిల్లీమీటర్లు పడింది. మొత్తంగా చూసినప్పుడు సాధారణం కంటే ఎక్కువే పడినప్పటికీ కీలకమైన జులై నెలలో వర్షాభావంతో పంటల సాగుపై ప్రభావం చూపింది.

ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ చేయాలి

రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయాలి. ఆగస్టు నెలలో వర్షాలు ఆలస్యంగా పడ్డాయి. ఇప్పుడు పడిన సమయంలో విత్తనాలు అందుబాటులో లేవు. వెంటనే పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేయాలి.

చంద్రశేఖర్‌రెడ్డి,
జిల్లా కార్యదర్శి ఎపి.రైతు సంఘం

జెఎన్‌టియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు అనుబంధ తైల సాంకేతిక పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన జెఎన్‌టియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శన్ రావు ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా మాదకద్రవ్యాల మహమ్మారిని దూరం చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించే ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఒటిపిఆర్ఐ విద్యార్థులు కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఉపకులపతి ఒఎస్‌డి ఎన్.దేవన్న, ఒటిపిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గా ప్రసాద్, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి ఎ.స్వరూప రాణి, ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, ఒటిపిఆర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి విసి

సెప్టెంబర్ నుంచి నిరవధిక సమ్మె

డిఆర్‌కు నోటీసు అందించిన తాగునీటి సరఫరా కార్మికులు

డిఆర్ఒకు సమ్మె నోటీసు అందిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు జి.ఓబులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి డిఆర్ఒ రామకృష్ణారెడ్డిని కలిసి సెప్టెంబర్ 5వ తేదీ నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులు 570 మంది 23 సంవత్సరాలుగా, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు 600 మంది 18 సంవత్సరాలుగా పని చేస్తున్నారని తెలిపారు. వీరికి నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా ఉందన్నారు. పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దెలు, నిత్యావసర సరుకులు, వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వేతనాల కోసం గత ప్రభుత్వంలో మూడు నెలలకోసారి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అసెస్‌మెంట్ కమిటీ ప్రతిపాదనలు కార్మికులు, ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నాయని, వాటిని రద్దు చేయాలన్నారు. సెప్టెంబర్ 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మెలోకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, శ్రీసత్యసాయి కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, జనరల్ సెక్రటరీ ఎన్.శ్రీనివాసులు, కోశాధికారి శ్రీరాములు, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్.ఎర్రిస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాము, ఉపాధ్యక్షులు అశోక్, నాయకులు ఎస్.వీలరయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నిద్రపోతున్న నిఘా..!

- పోలీసుల సమయం అంతా నాయకుల చుట్టూ తిరగడానికే సరి
- ఇదే అదనుగా రెచ్చిపోతున్న దొంగలు

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ఇటీవల అనంతపురం నగరం, పరిసర ప్రాంతాల్లో చోటు చేసుకున్న దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, అరాచక శక్తులు రెచ్చిపోతున్న వైనం చూస్తుంటే నిఘా వ్యవస్థ నిద్ర పోతోందా అన్న అనుమానాలు రాకమానవు. సాధారణంగా ప్రతి పోలీసు స్టేషన్‌లోనూ ఉన్నతాధికారి ఆయా స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై నిఘా, సమస్యాత్మక ప్రాంతాల్లో రాత్రిపూట గస్తీ తదితర విధులకు సిబ్బందిని కేటాయించి తదనుగుణంగా పర్యవేక్షించడం బాధ్యతగా ఉంటుంది. ఇప్పుడున్న పరిస్థితులు అందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నట్లు సమాచారం. బదిలీల నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది తాము పనిచేసే చోట ఉంటామో లేదో కూడా తెలియని అయోమయంలోకి వెళ్లారు. దీంతో శాంతిభద్రతలు గాలికి వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలీసు శాఖను ప్రక్షాళన చేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా

ఇప్పటికే రాష్ట్రంలో పలువురు పోలీసు అధికారులను బదిలీ చేశారు. వీరిలో ఎక్కువ మందిని జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు సరెండర్ చేశారు. దీంతో మిగిలిన పోలీసు అధికారులు, సిబ్బందిలో బదిలీ భయం నెలకొంది. బదిలీ నుంచి తప్పించుకోవడానికి అన్ని మార్గాలను అన్వేషించే పనిలో పడ్డారు. ఇకవేళ బదిలీ తప్పనిసరి అయితే తమకు అనుకూలమైన చోటుకు వెళ్లేలా నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రతి రోజూ అధికార పార్టీ నాయకులు ఎక్కడ దొరుకుతారన్న దానిపైనే ఎక్కువ కేంద్రీకరిస్తున్నారు. ఈ పరిణామంతో పోలీసు వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జరుగుతున్న దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి.

చెలరేగుతున్న దొంగలు

పోలీసు అధికారులు, సిబ్బంది వారి బాధ్యతలను గాలికి వదిలి నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండడంతో దొంగలు రెచ్చిపోతున్నారు. వారం రోజుల వ్యవధిలోనే రెండు ఏటీఎం దొంగతనాలు, కార్ల షోరూం లోకి చొరబడటం జిల్లాలో నిఘా వ్యవస్థ నిద్రావస్థకు అద్దం పడుతోంది. ఇప్పటికైనా పోలీసు అధికారులు, సిబ్బంది నిద్రావస్థ ను వీడి దొంగలు, అరాచక శక్తులను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేషన్‌లో స్థలం రచ్చ..!

- అధికారి వర్సెస్ కార్పొరేటర్
- ఉద్యోగి బిల్డర్‌గా మారాడంటూ కార్పొరేటర్ ఫైర్
- అధికారులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఓ స్థలం వివాదం రాజుకుంది. ఏకంగా కార్పొరేషన్ ఉద్యోగి, కార్పొరేటర్ నడుమ సమస్య నడుస్తోంది. ఉద్యోగి గుత్తేదారుల అవతారం ఎత్తి విధులకు డుమ్మా కొడుతున్నారంటూ 3వ డివిజన్ కార్పొరేటర్ కుమారమ్మ భర్త వైసీపీ నాయకుడు కృష్ణమూర్తి టౌన్ ప్లానింగ్ విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ మారుతి ప్రసాద్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ స్థల వివాదం కార్పొరేషన్‌లో ప్రస్తుతం చర్చనీయాంశం అయ్యింది.

నగర పరిధిలోని కొవ్వూరు నగర్‌లో అనధికార లేఅవుట్ సర్వేనెంబర్ 53లో 10, 11 ప్లాట్లు టౌన్ ప్లానింగ్ గుమస్తా యుగంధర్ రెడ్డి సోదరుడి ఆధ్వర్యంలో ఉండడంతో ఆ స్థలంలో ఇటీవల నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులు చేపట్టడంపై కార్పొరేటర్ కుమారమ్మ భర్త వైసీపీ నేత కృష్ణమూర్తి అభ్యంతరం తెలిపారు. ఆ స్థలం తనకు చెందినదని పేర్కొంటూ అందుకు సంబంధించిన పత్రాలను చూపించాడు. ఓపెన్ సైట్లను ఆక్రమించి ఉద్యోగి బిల్డర్‌గా అవతారమెత్తి నిర్మాణం పనులు చేపడుతున్నాడని కార్పొరేటర్ కుమారమ్మ కార్పొరేషన్ అధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై శుక్రవారం మధ్యాహ్నం కార్పొరేటర్ భర్త అసిస్టెంట్ సిటీ ప్లానర్ మారుతి ప్రసాద్‌తో వాదించాడు. స్థలానికి సంబంధించిన పత్రాలు అన్నీ తన వద్ద ఉన్నా కార్పొరేషన్ ఉద్యోగి ఎలా నిర్మాణం చేస్తాడంటూ ప్రశ్నించాడు. ఉద్యోగి విధులకు హాజరుకాకుండా నిర్మాణ పనుల్లో ఉన్నా పట్టించుకోరా అని నిలదీశాడు. కాగా ఈ అనధికార లేఅవుట్‌లో యుగంధర్ రెడ్డి సోదరుడి వద్ద స్థల పత్రాలతో పాటు సర్వే పత్రాలను ఉన్నట్లు తెలుస్తోంది. కృష్ణమూర్తి వద్ద సర్వే రిపోర్టు లేకపోవడంతో వివాదం ప్రారంభమైంది. ఈ స్థలాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్వే నెంబర్లు గందరగోళంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ సమయంలో కార్పొరేటర్ భర్త కృష్ణమూర్తి స్థలానికి సంబంధించి సర్వే జరిపి రిపోర్టు వచ్చేవరకు నిర్మాణ పనులు చేపట్టకుండా నిలిపేయించాలని అధికారులతో పట్టుబట్టారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎటూ తేల్చక సమస్యను అలానే వదిలేశారు.

లేఅవుట్లలో రహదారులు, కాలువలు, వీధిదీపాలు తదితర వాటికి ఓపెన్ సైట్ కేటాయింపులు జరిపి ఉంటే ప్లాట్లు ఎవరివన్న వివరాలు స్పష్టంగా తెలుస్తాయి. లేఅవుట్లలో ఇలాంటి నిబంధనలు ఏవీ లేకపోవడంతో చాలా చోట్ల వివాదాలు తెరపైకి వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు వేసిన చోట కొనుగోలు చేసిన చాలా మంది స్థల వివాదాల్లో ఇరుక్కుని ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం కొవ్వూరునగర్‌లో అధికారి, కార్పొరేటర్ మధ్య నెలకొన్న స్థల వివాదం కూడా నిబంధనలు పాటించకపోవడం వల్లనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ స్థల వివాదంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ చేసి ఉంటే టౌన్ ప్లానింగ్ విభాగానికి ఉన్న అవినీతి మచ్చ మరింత పెరిగే అవకాశం ఉంటుందనటంలో సందేహం లేదు. నగరంలో ఇలాంటి వివాదాస్పద స్థలాలపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే వాదనలు ప్రజల నుంచి విన్పిస్తున్నాయి.

ఆచార్య ఎండ్ల వెంకట్రావుని సన్మానిస్తున్న ఎంబిఎ విభాగపతి ఆచార్య టి.నారాయణ రెడ్డి

సంక్షోభం నుంచే విజయతీరం చేరుకోవాలి

పాండిచ్చేరి కేంద్రీయ విద్యాలయం డీన్ ఎండ్ల వెంకటరావు

ప్రజాశక్తి-అనంతపురం

సంక్షోభాలు సర్వసాధారణ మైన విషయాలని, వాటి నుంచే విజయతీరం చేరుకోవాలని పాండిచ్చేరి కేంద్రీయ విద్యాలయం మేనేజ్మెంట్ డీన్ ఎండ్ల వెంకటరావు పేర్కొన్నారు. శుక్రవారం నాడు మేనేజ్మెంట్ కళాశాల ఆధ్వర్యంలో జెఎన్‌టియు ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా "బిల్డింగ్ రెజిలెన్స్ ఫర్ సస్టైనబుల్ బిజినెస్" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. మేనేజ్ విభాగం డాక్టర్ టి.నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరావు మాట్లాడుతూ ఎదురయ్యే సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొని సుస్థిర అభివద్ధి సాధించే దిశగా అడుగులు ముందుకేయాలన్నారు. కోవిడ్, ఉక్రెయిన్ యుద్ధం, ప్రపంచ ఆర్థిక సంక్షోభం లాంటివి ఎదుర్కొని వివిధ వ్యాపార సంస్థలు అభివృద్ధి పథంలో ముందుకు నడిచిన విషయాలను గమనంలో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జాకీర్ హుస్సేన్, విశ్వనాథ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల రక్షణపై విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాల, జడ్పీ హైస్కూల్ విద్యార్థులు పోలీస్‌స్టేషన్ సర్కిల్ నుంచి వినాయక సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి రోల్ ప్లే నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ నేటి సమాజంలో రోజురోజుకూ మహిళలపై వేధింపులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతుండడం సిగ్గు చేటన్నారు. నిందితులపై ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఇకనైనా మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లేశ్వరి, ఎన్‌జిఒ మహిలా అధ్యక్షురాలు జైనబి, మహిళా కళాశాల లెక్చరర్లు, వైద్య సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్, మహిళా ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు

మానవహారంగా ఏర్పడి రోల్ ప్లే నిర్వహించిన విద్యార్థినులు

ఉపాధ్యాయులను బదిలీ చేయొద్దు

ప్రజాశక్తి-కుందుర్పి

తమ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను బదిలీ చేయవద్దని కోరుతూ శుక్రవారం మండ లంలోని కెంచంపల్లి పాఠశాల ఆవరణలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గంట సేపు బైఠాయించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ గ్రామం మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్నా బస్సు సౌకర్యం లేదన్నారు. పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకూ 93 మంది విద్యార్థులు ఉండగా 8 మంది ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. అయితే ఇప్పుడు ముగ్గురు ఉపాధ్యాయులను మరో పాఠశాలలకు బదిలీ చేస్తే కేవలం ఐదుగురితో బోధన ఎలా సాగుతుందని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఎంఇఒ తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లగా నిబంధనల మేరకే సర్దుబాటు జరుగుతుందన్నారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, సిపిఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవలపై సోషల్ మీడియాలో ఓ వీడియో హల్‌చల్ చేసిన నేపథ్యంలో శుక్రవారం జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ పాల్ రవికుమార్ ఆసుపత్రిని సందర్శించి విచారణ చేపట్టారు. సూపరింటెండెంట్ మాధవి, వైద్యులు, సిబ్బంది, రోగులు, సిపిఐ, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ప్రతినిధులతో మాట్లాడారు. సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ప్రతినిధులు జిల్లా కోఆర్డినేటర్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పాల్ రవికుమార్ మాట్లాడుతూ వైద్యులు పని వేళల్లో తప్పనిసరిగా ఆసుపత్రిలో ఉండి సేవలు అందించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ ప్రమాదంలో యువరైతు మృతి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మృతి చెందిన నాగేంద్ర (ఫైల్‌ఫొటో)

మండలంలోని దేవగిరి గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో ఓ యువత రైతు శుక్రవారం మరణించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. దేవగిరి గ్రామానికి చెందిన వడ్డే నాగేంద్ర(25)కు వ్యవసాయ పొలం ఉంది. బోరుబావి కింద ఈయన పంటలు సాగు చేసేవాడు. వ్యవసాయ బోరుబావి కోసం సమీపంలోని విద్యుత్ స్తంభం నుంచి కరెంట్ తీగను ఏర్పాటు చేసుకున్నాడు. విద్యుత్ అధికారులు ఈ తీగను వేసే క్రమంలో అదనపు స్తంభాన్ని ఏర్పాటు చేయకుండా రైతు పొలం చుట్టూ రక్షణ నిమిత్తం వేసుకున్న ఇనుప కంచెకు ఈ విద్యుత్ తీగను తాడుతో కట్టారు. గాలికి తరుచూ విద్యుత్ తీగ ఇనుప కంచెకు రాసుకోవడంతో తీగపై ఉన్న ప్లాస్టిక్ ఊడిపోయింది. దీంతో ఇనుప కంచెకు విద్యుత్ తీగ నుంచి విద్యుత్ సరఫరా అయ్యింది. రోజు మాదిరే రైతు నాగేంద్ర పొలం పనుల నిమిత్తం శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో వెళ్లాడు. పొలానికి వేసిన ఇనుప గేటును తెరిచేందుకు ముట్టుకోగానే షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. సమీప రైతులు గుర్తించి విషయాన్ని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలియజేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా విద్యుత్ అధికారులు సరైన రక్షణ లేకుండా విద్యుత్ తీగను ఇనుప కంచెపై ఏర్పాటు చేయడం వల్లనే ప్రమాదం జరిగి రైతు మరణించాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మరణానికి విద్యుత్ అధికారులే బాధ్యత వహించి బాధిత రైతు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా విద్యుత్ అధికారులు మాత్రం ఈ ప్రమాదంతో విద్యుత్ శాఖకు ఎలాంటి సంబంధం లేదంటూ తెలియజేశారు.

గ్రామాభివృద్ధిపై గ్రామసభలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చేందుకే గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం అనంతపురం రూరల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి ఉదయ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచితోపాటు ఉపసర్పంచులు పలు సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, వ్యవస్థ నిర్మాణం, ఇంటింటికీ తాగునీటి కొళాయిల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు టిసి.వరుణ్, జనసేన రాయలసీమ కమిటీ అధ్యక్షులు పెండ్యాల శ్రీలత, బిజెపి రాష్ట్ర కార్యదర్శి లలిత్‌కుమార్, తహశీల్దార్ హరిప్రసాద్, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళి, నాయకులు సుధాకర్‌నాయుడు, గంగారామ్, కృష్ణకుమార్, జయరామ్‌నాయుడు, రాయల్ మురళి, సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, పోతుల లక్ష్మీనరసింహులు, కుంచెపు వెంకటేష్, జనసేన ఉపాధ్యక్షుడు జయరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

అలాగే రాజీవ్‌కాలనీ పంచాయతీ గ్రామ సచివాలయం-2 పరిధిలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి-2 రమీజాబీ, గ్రామ సచివాలయం-2 సెక్రటరీ మహేశ్వరరెడ్డి, అనిత, టిడిపి నాయకులు లింగమయ్యస్వామి, వైసిపి నాయకులు హుసేన్, సిపిఎం నాయకులు ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: అనంతపురం రూరల్ మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలు ప్రశాంతంగా ముగిశాయి. అధిక భాగం పెన్షన్లు, నీటి సరఫరా, ఇళ్ల స్థలాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ హాజరై ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.

పుట్లూరు: ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయనున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. శుక్రవారం మండలంలోని కడవకల్లు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఉపాధి హామీ పథకంలో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం సంతోషకరమన్నారు. గ్రామసభల్లో చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి పరిష్కరించుకోనున్నట్లు తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఎంఇఒ శ్రీదేవి, డీటీ మల్లేష్‌ప్రసాద్, ఆర్‌ఐ కిష్టప్ప, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, నాయకులు బాలరాయుడు, చెన్నారెడ్డి, వేణు, రామాంజి, గోవర్ధనరాజు, శ్రీనివాసులనాయుడు, నాగేశ్వరరెడ్డి, ప్రసాద్‌నాయుడు, రవీంద్రనాయుడు, రామమునిరెడ్డి, వెంకట్ రాముడు, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నేతల వినతి

పెండింగ్‌లో ఉన్న ఉపాధి పథకం బిల్లులను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సిపిఎం నాయకులు కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, నాయకులు జి.వెంకటచౌదరి, టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, ఇ.నాగభూషణ్, బి.కుళ్లాయప్ప, కిషోర్, హరి, సాలమ్మ, జయలలిత, వరలక్ష్మి పాల్గొన్నారు.

గుత్తి: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం జాతీయ ఉపాధి హామీ పథకం పై సామాజిక తనిఖీ సందర్భంగా గ్రామసభలు జరిగాయి. ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని బసినేపల్లి గ్రామంలో ఇఒఆర్‌డి శివశంకర్‌రెడ్డికి సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ వినతిపత్రం అందజేశారు.

తాడిపత్రి రూరల్: మండల వ్యాప్తంగా 26 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని గన్నెవారిపల్లి పంచాయతీలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనులను పునర్నిర్మించాలన్నారు.

కాగా పెద్దపొలమడ గ్రామంలో నిర్వహించిన సభలో సిపిఎం నాయకులు పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధి కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి తక్షణమే పని కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని సూచించారు.

బుక్కరాయసముద్రం: మండలవ్యాప్తంగా శుక్రవారం గ్రామసభలను నిర్వహించారు. ముఖ్యంగా మండలంలోని దండువారిపల్లి, పసలూరులో ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించిన సభల్లో మండల అధ్యక్షురాలు దాసరి సునీత ఆమె మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ గ్రామాభివృద్ధే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులపై తీర్మాణాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తేజోష్న, ఇఒఆర్‌డి దామోదరమ్మ, ఎపిఒ పోలేరయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హేమలత, ఎంపిటిసి గాయత్రి, పంచాయతీ సెక్రటరీ ఆదిలక్ష్మి, స్థానిక నాయకులు ఆదినారాయణ, నారాయణస్వామి పాల్గొన్నారు.

రాప్తాడు: మండల కేంద్రంలోని ద్రాపాకట్టపై గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈకార్యక్రమంలో మండల తహశీల్దార్ విజయకుమారి, ఎంపిడిఒ సాలమన్‌రాజ్ మండల కన్వీనర్ పంపు కొండప్ప, మాజీ కన్వీనర్ సాకే నారాయణస్వామి, సర్పంచి తిరుపాలు, తెలుగుదేశం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిడిఒ రామకృష్ణ, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల పరిధిలోని 15 పంచాయతీల్లో ఎంపిడిఒ నరసింహమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో మౌలిక వసతుల గ్రామసభల ద్వారా తీర్మానం చేసుకుని ఆమోదం కోసం అధికారులకు పంపిస్తే వాటిని మరల ఆయా సంబంధిత అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సురేష్, పంచాయతీ సెక్రటరీ రాజేష్, సర్పంచి జయలక్ష్మి, టిడిపి మండల కన్వీనర్ గిరి మల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాటవ సన్నన్న, చిన్ని కిష్టప్ప, ప్రతాప్, బొమ్మ శంకరప్ప, సిద్ధలింగప్ప, స్కూల్ కమిటీ ఛైర్మన్ యశోధర, పీడీ వన్నూరప్ప పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలవ్యాప్తంగా శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించుకుని పరిష్కరించుకునేందుకే ప్రభుత్వం గ్రామసభలు పెట్టిందన్నారు. అనంతరం పలుసమస్యలపై స్థానికులు వినతులు సమర్పించారు. ఆయా సమస్యలను ప్రాధాన్యతను బట్టి పరిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ యు.శంకర్, టిడిపి హిందూపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి శివారెడ్డి, బోదపాటి హరి వెంకటనారాయణ, మాధవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పిల్లల వేణు, ప్రతాప్, కందుల ఓబులపతి, మనోరంజన్, హనుమంతప్ప చౌదరి, నరసింహప్ప, అక్కులప్ప, రామదాసు, బోమయ్య, ఉమాపతి, లక్ష్మీదేవమ్మ, చెన్నమ్మ, ఆనంద్, సుధాకర్, ప్రజలు పాల్గొన్నారు.

నార్పల: మండల వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో ప్రధానంగా తాగునీటిపైనే చర్చ సాగింది. ఈ సందర్భంగా సభలకు హాజరైన ప్రజలు, నాయకులు పలుసమస్యలను సభ దృష్టికి తీసుకరాగా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించుకుందామని చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యేక అధికారి రామసుబ్బారెడ్డి, ఎంపిడిఒ దివాకర్, సర్పంచి సుప్రియ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రవీంద్రనాథ్‌రెడ్డి, కార్యదర్శి అశ్వర్థనాయుడు, ఉప సర్పంచ్ గవ్వల శ్రీరాములు, మాజీ ఎంపిపి ఆకుల అరుణ, జనసేన నాయకులు గంజికుంట రామకృష్ణ, తుపాకుల భాస్కర్, టిడిపి నాయకులు మహేష్‌నాయుడు, సామాజిక సేవ కార్యకర్తలు శివశంకర్, నాగభూషణ, ప్రవీణ్, అనిల్, వాహనకర్తలు నాయకులు సచివాలయ వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: మండల పరిధిలోని వేములపల్లి గ్రామంలో సర్పంచి అశోక్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ముందుగా పంచాయతీ అభివృద్ధిలోని అంశాలను పంచాయతీ కార్యదర్శి స్నేహ చదివి వినిపించారు. తర్వాత గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పించేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో అధికారులు, కూలీలు పాల్గొన్నారు.

కాగా మండల పరిధిలోని వెన్నపూసపల్లి గ్రామంలో టిడిపి నాయకులు భైరవేశ్వర్, వైసిపి నాయకుడు భోగాది దిలీప్ కుమార్‌రెడ్డి వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. గతంలో మంజూరు చేసిన పింఛన్ల పంపిణీపై వివాదం చోటు చేసుకుంది. ఎట్టకేలకు పింఛన్లపై విచారణ చేపడతామని అధికారులు హామీ ఇవ్వడంతో సద్దుమనిగింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఎపిఒ షబ్బీర్, పంచాయతీ కార్యదర్శి గీత, టిడిపి నాయకులు వెంకటరమణ, సూర్యనారాయణ, నారాయణస్వామి పాల్గొన్నారు.

అనంతపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్

కేసు నమోదు..

ఇకపోతే గ్రామసభలో ఘర్షణ పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ సుబ్రమణ్యం తెలిపారు. అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు గొడ్డుమర్రి భైరవేశ్వర్‌పై దాడి చేసిన ఆరుగురిపై 324 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు

శింగనమల: మండల పరిధిలోని సోదనపల్లి గ్రామ పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు వ్యవసాయ అధికారి, నోడల్‌ఆఫీసర్ అన్వేష్‌కుమార్ తెలిపారు. వీటితోపాటు గ్రామంలో మౌలిక వసతులపై తీర్మాణాలు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి నర్మద, ఇంజనీర్ ప్రణవిత, మహిళా పోలీస్ నాగవేణి, వెల్ఫేర్ అసిస్టెంట్ హర్షవర్ధన్, ఏఎన్ఎం పద్మావతి, అంగన్వాడీ కార్యకర్త రత్నమ్మ, డిజిటల్ అసిస్టెంట్ బాషా, టిడిపి నాయకులు అట్టే రామాంజనేయులు, పేట శివారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సాంబశివారెడ్డి, ఏకిల ఆదినారాయణ, అట్టే శ్రీనివాసులు, అట్టే చిన్న చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

పామిడి: మండల కేంద్రంలో పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్ అధ్యక్షతన టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ముందుగా పంచాయతీ అభివృద్ధిలోని అంశాలను ప్రజలకు చదివి వినిపించారు. అనంతరం గ్రామానికి అవసరమయ్యే మౌలిక వసతులపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఆర్.రమేష్, గౌస్, జింకల సంజీవకుమార్, బొమ్మా మోహన్, ముసలిరెడ్డి, కరూరు శివ, కొట్టం మాలిక్, సుంకప్ప, నల్లబోతుల శీన, మనవల ఆంజనేయులు, కుమార్, ఎదురూరు మల్లికార్జున, ఎంసీ సుంకన్న, హమాలీ గోపాల్, పురుషోత్తం, అంజి, అశోక్,సుంకిరెడ్డి, జనసేన ధను, రాజేష్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని నోడల్ ఆఫీసర్ భాస్కర్ సూచించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నోడల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్, హౌసింగ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: గ్రామసభల నిర్వహణతో గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు తెలిపారు. మండలంలోని బ్రహ్మసముద్రం, వేపులపర్తి, భైరసముద్రం, సంతే కొండాపురం, పాలవెంకటాపురం గ్రామాల్లో ఆయా పంచాయతీ సర్పంచిల అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, టిడిపి నాయకులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో సర్పంచులు అధ్యక్షతన స్పెషలాఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు ఏర్పాటు చేశారు. కుందుర్పిలో సర్పంచి మారుతీశ్వరిరామ్మూర్తి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, సర్పంచులు, స్పెషలాఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, టిడిపి, వైసిపి నేతలు పాల్గొన్నారు.

బొమ్మనహాల్: మండల వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో ఉదయం 11 నుంచి 2 గంటల వరకూ, మరికొన్ని గ్రామాల్లో 3 నుంచి 4 గంటల వరకూ అధికారులు గ్రామసభలు నిర్వహించారు. సభల్లో ఎంపిడిఒ షకీలా బేగం, తహశీల్దార్ మునివేలు, ఈవోఆర్‌డి దేవదాస్, ఆయా పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పుట్లూరు మండలంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

తాడిపత్రి మండలంలో వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

అంధకారంలో రుద్రంపేట

24 గంటలుగా విద్యుత్ కట్ - ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

నగరం నడిబొడ్డున ఉన్న రుద్రంపేటలో 24 గంటలుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో రుద్రంపేట మొత్తానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా రాత్రంతా దోమలు, ఉక్కపోతతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం ఉదయం అయినా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. శుక్రవారం సాయంత్రం తీరా చీకటి పడే సమయానికి ఒక పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను తెచ్చి బిగించారు. అయితే కనెక్షన్ ఇవ్వగానే అది కూడా కాలిపోయింది. దీంతో కనీస అవసరాలకు కూడా నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని

రెండోసారి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

కొవ్వొత్తులతో నిరసన

నిరసన తెలుపుతున్న విద్యార్థినులు, ఐద్వా నాయకులు

గుత్తి: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, ఆర్ఎన్. కవిత, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు సత్యసాయి కార్మికుల ఆందోళన

నిరసన తెలుపుతున్న సత్యసాయి కార్మికులు

నార్పల: మండల పరిధిలోని బి.పప్పూరు వద్ద ఉన్న సత్యసాయి నీటి పథకం కార్మికులు చేపట్టిన ధర్నా శుక్రవారం రెండవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పంప్‌హౌస్ ముందు కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి పథకానికి నిధులు కేటాయించకపోవడంతో ఐదు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాకుండా అధికారులు గతంలో ఉన్న ధర కంటే తక్కువ ధరకు టెండర్ ఇవ్వడంతో గుత్తేదారులు ముందుకు రాలేదన్నారు. ఫలితంగా పథకం మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం చిన్న మరమ్మతులు చెయ్యడానికి కూడా ఇబ్బందిగా ఉందన్నారు. ఆయా సమస్యలపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా చర్యలు శూన్యమన్నారు. విధిలేని పరిస్థితుల్లో సమ్మెకు వెళ్లామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, నాగభూషణ, చంద్రమోహన్, నరసింహులు, పుల్లానాయుడు, అంకన్న, వెంకటరమణ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

వజ్రకరూరు: గ్రామీణ ప్రాంత విద్యార్థుల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధార్థ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అనేకమంది విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుంచి చదువుకోవడానికి ఉరవకొండకు వస్తున్నారన్నారు. వారందరికీ బస్సుపాసులు మంజూరు చేశారుగానీ, సమయానికి బస్సులు నడపడం లేదన్నారు. దీంతో ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కావున ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యార్థుల సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని కోరారు.

మొక్కజొన్న పంట పరిశీలన

శింగనమల: మండల పరిధిలోని ఈస్ట్ నరసాపురం గ్రామంలో ఉన్న కిష్టారెడ్డి పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను వ్యవసాయ శాఖ అధికారి అన్వేష్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ రాజారెడ్డి, రైతు కృష్టారెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

ఈక్రాప్ నమోదుకు అధికారి నియామకం

యల్లనూరు: మండలంలోని కల్లూరు గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలకు ఈక్రాప్ నమోదు చేసేందుకు హెచ్ఎఒ రామాంజనేయులును నియమిస్తూ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజాశక్తి దినపత్రికలో 'అందుబాటులో లేని విహెచ్ఎ' అంటూ శుక్రవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు ఉన్నతాధికారులు స్పందిస్తూ విహెచ్ఎ ఉదయభానుకు బదులుగా రామాంజనేయులును నియమించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే ప్రాంతాల్లో అడ్డుగోడలను తొలగించాలి : సిపిఎం

ఆందోళనలో మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

రైల్వే ప్రాంతంలోకి ప్రవేశించకుండా రహదారిపై అడ్డుగా నిర్మించిన గోడలను తొలగించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు హెచ్చరించారు. రైల్వే అధికారుల అలసత్వాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక ట్రావెల్స్ బంగ్లా నుంచి డిఆర్ఎం కార్యాలయం వరకూ సిపిఎం ఆధ్వర్యంలో పలు కాలనీల ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం రైల్వే అధికారులకు వినతిపత్రం సమర్పించేందుకు నిరాకరించడంతో కార్యాలయం గోడకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ రైల్వే ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందికరంగా మారిన గోడలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు రంగమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు వైటిసి.రమేష్, పట్టణ కార్యదర్శి వెంకీ, పట్టణ కమిటీ సభ్యులు జాకీర్, రామునాయక్, లక్ష్మీ, అబ్దుల్లా, ఖాదర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మిమ్మల్ని ఆకట్టుకునేలా ఫోన్ సంభాషణలో నటించి ఫెడ్ ఎక్స్ కొరియర్ సర్వీస్ నుంచి ఫోన్ చేస్తున్నామని పరిచయం చేసుకుంటారన్నారు. మీ పేరుపై పార్సిల్ వచ్చిందని చెప్పి మిమ్మల్ని నమ్మించి మీఆధార్, పాన్, బ్యాంక్ డీటెయిల్స్‌ను తెలుసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. మీపై నిజంగా ఏదైనా పోలీస్ కేసు ఉంటే సంబంధించిన పోలీస్ నేరుగా మీ వద్దకే వస్తారన్నారు. అంతేగానీ వాట్సప్‌లో కాల్ చేసి వివరాలు అడగరన్నారు. ఒకవేళ సైబర్ నేరాల బారిన పడిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కుగానీ, www.cybercrime.gov.in కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

In The Court of The Prl. District Judge, Ananthapuramu
Criminal Revision Petition No:14/2024
Between:
Nagendramma ...Revision Petitioner/owner of the Motor Cycle
And
State by SHO of Ananthapuramu IV Town PS and others
...Complainant/Respondants/Accused
Notice to Respondant No:4
R4:Sake Ashok S/o K.Sarath Babu, 4-174, Chandra Babu Nagar, Rudrampeta, Ananthapuramu.
పై నెంబరు కేసులో 4వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తం 30/08/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.MALLESH,
Advocate, Anantapuramu.

In The Court of The IInd Addl. Junior Civil Judge, Ananthapuramu
O.S.No:1554/2023
Between:
Bontha Rajasekhar Reddy ...Plaintiff
And
S.Syed Basha ...Defendant
Notice to Defendant
To,
S.Syed Basha S/o S.Vali Sab, Residing at D.No:18-943, Neeruganti Street, Old Town, Ananthapuramu.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 30/08/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
A.RAMI REDDY,
G.RAMAKISHORE REDDY,
Advocates, Anantapuramu.Cell:9849667645

బ్రాహ్మణ సొసైటీకి రూ.40 లక్షలు అందజేత

అనంతపురం కలెక్టరేట్ : ఎపి బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి రూ.40లక్షల రుణాల చెక్కును ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ శుక్రవారం నగరంలోని రోడ్డు, భవనాల శాఖ అతిథి గృహంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ మేనేజర్ బిందు, క్యాషియర్ కరణం నవ్యశ్రీ, ప్రసాద్‌రావు, రాఘవేంద్రరావు, విశ్వేశ్వరరావు, సంధ్య, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకు సన్మానం

నార్పల : బదిలీపై వెళ్తున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డిని శుక్రవారం స్థానిక స్టేషన్‌లో సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా శాలువా కప్పి సన్మానించారు. అలాగే ఎంఆర్‌పిఎస్ నాయకులు కూడా ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రంగాపురం పుల్లప్ప, ఈ కార్యక్రమంలో రాజగోపాల్, శ్రీరాములు, రాజు, రమణ, నారాయణ, కేశేపల్లి ఆదెప్ప, వేణుగోపాల్ గడ్డంనాగేపల్లి చంద్ర, నార్పల ప్రసాద్, కిష్ట, తుంపెర రమణ, మోహన, నార్పల జంగాల శివయ్య, కేశేపల్లి పూజారి రామాంజి, అమ్మలదిన్నె కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది

గులాబీ రంగు పురుగును నివారించాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పత్తిపంటలో గులాబీ రంగు పురుగును నివారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ సూచించారు. శుక్రవారం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, రాయల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్దవడుగూరు మండలం దిమ్మగుడి, చిట్టూరు, కండ్ల గూడూరు గ్రామాల్లో పర్యటించి పత్తి పంటలో రైతులు తీసుకొవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ కేవలం పురుగుల మందుల ద్వారానే గులాబీ రంగు పురుగు ఉధృతిని నివారించలేమన్నారు. అయితే లింగాకర్షణ బుట్టలు ఒక ఎకరానికి 20 చొప్పున 35 రోజుల పంట నుంచే పొలంలో పెట్టుకుంటే గులాబీ రంగు పురుగును సామూహికంగా కట్టడి చేయవచ్చన్నారు. అలాగే తెల్ల, పచ్చదోమ, తామర పురుగు వంటి రసం పీల్చే పురుగులను పసుపు, నీలం రంగు జిగురు అట్టల ద్వారా అరికట్టవచ్చన్నారు. తర్వాత పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ అసోసియేట్ శివ, రిలయన్స్ ఫౌండేషన్ రాయలసీమ కోఆర్డినేటర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

డ్రోన్ ద్వారా దోమల నివారణ స్ప్రేయింగ్

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని సూర్యానగర్, మరువవంకలో శుక్రవారం డ్రోన్ ద్వారా దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మూర్తి, ఎంహెచ్ఒ విష్ణుమూర్తి, కార్పొరేటర్ అబూసలేహా, మలేరియా సహాయకుడు శంకరయ్య, పారిశుధ్య కార్యదర్శి దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

జాతీయ అంతరిక్ష దినోత్సవం

శింగనమల : చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా భారత ప్రభుత్వం ప్రకటించిన జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహినంచారు. ఇందులో భాగంగా బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం గ్రామం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి కళాశాలలో అంతరిక్షం అంశానికి సంబంధించి చిత్రలేఖనం, ప్రదర్శన పోటీలను నిర్వహించారు. పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.బాలకృష్ణ, సైన్స్, హ్యూమానిటీస్ విభాగాధిపతి గురుసిద్దప్ప, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు ప్రాజెక్టు నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని చాగల్లు ప్రాజెక్టు గేటు ఎత్తి దిగువకు నీరు విడుదల చేశారు. ముందుగా ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి గంగమ్మకు పసుపు, కుంకుమ సమర్పించి పూజలు చేశారు. అనంతరం జలహారతి ఇచ్చి ఒక గేటును సుమారు ఒక అడుగు మేర ఎత్తి దిగువకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాజెక్టు దిగువ ప్రాంతాల రైతులు భూగర్భజలాలు పెరిగి సమస్యశ్యామలంగా ఉండాలని కాంక్షించారు. ముఖ్యంగా పెద్దపప్పూరు, గార్లదిన్నె, బొందలదిన్నె, తదితర గ్రామాల ప్రజలు, రైతులకు భూగర్భజలాలు పెరిగి పుష్కలంగా నీరు లభిస్తుందన్నారు. కాగా చాగల్లు ప్రాజెక్టు ఊట నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పెద్దయక్కలూరు ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చిత్తంజన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, యువ నాయకులు లోక్‌నాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, సింగనగుంటపల్లి నాగరాజు, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, పెద్దయక్కలూరు ఓబిరెడ్డి, కుసుమారెడ్డి, చాగల్లు శంకర్ పాల్గొన్నారు.

గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

స్వల్పకాలిక పంటలు సాగు చేసుకోండి

ప్రజాశక్తి-గార్లదిన్నె

ఖరీఫ్ -2024 సంబంధించి ఇప్పటి వరకూ పంటలు సాగు చేయని రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు స్వల్పకాలిక జొన్న, సజ్జ, కొర్ర, పెసర, అలసంద, ఉలవ, తదితర పంటలను సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఓబులాపురం కొట్టాల గ్రామంలో రైతు నారాయణరెడ్డి సాగు చేసిన ఆముదం పంటను మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంతవరకు మండలంలో 27527 ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా కేవలం 5832 ఎకరాలు మాత్రమే ఈ పంట నమోదు జరిగిందన్నారు. మిగిలిన రైతులు కూడా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని కోరారు. పంట నమోదు చేయించకపోతే ప్రభుత్వ పథకాలు వర్తించవని తెలిపారు. అదేవిధంగా పంట సాగు చేసిన రైతులు పంటలకు తెగుళ్ళు, పురుగులు సోకకుండా పంట యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. త్వరలోనే రైతులకు స్వల్పకాలిక పంట విత్తనాలను రైతు సేవాకేంద్రాల ద్వారా సబ్సిడీతో అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ గోపాల్‌రెడ్డి, సర్వేయర్ గణేష్, ఎంపీఈఓ లలిత, బాబా ఫక్రుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

ఆముదం పట్టన పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరి

ఆసుపత్రిలో ఉచిత భోజనం

గుత్తి : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణుల సౌకర్యార్థం టిడిపి నాయకులు శుక్రవారం ఉచిత భోజన సౌకర్యాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తల్లి శారదమ్మ, ఆయన సోదరుడు నారాయణ స్వామి సతీమణి త్రివేణి జ్ఞాపకార్థం ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచితంగా మినరల్ వాటర్ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు నారాయణ, టిడిపి నాయకులు ఎంకె.చౌదరి, కోనంకి కృష్ణ, సొలమాన్ రాజా, చికెన్ శీనా, జక్కలచెరువు గోవిందు, వాసు, న్యాయవాది సోము, జనసేన నాయకులు అశ్వ నాగప్ప, పాటిల్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

గుమ్మఘట్ట : మండల పరిధిలోని తాళ్లకెర గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చందనాయుడు, విద్యాకమిటీ ఛైర్మన్ రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్దేశ్వర, వరలక్ష్మి, స్వరూప, గ్రామ పెద్దలు కె.సత్యనారాయణరెడ్డి, నల్లె ఓబులేసు, బి.పాలయ్య, బెస్త వెంకటేష్, వి.ఎం.వీరభద్ర, బోయ మరెన్న, గొల్ల ఈరన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది పనితీరుపై సమీక్ష

వజ్రకరూరు : ఉరవకొండ మండలం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది పనితీరుపై వైద్యాధికారిణి పావని ఆధ్వర్యంలో నెలవారి సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణుల నమోదు, అబా హెల్త్‌కార్డుల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంసిపి కార్డులను పూర్తిగా నింపాలన్నారు. హై రిస్క్ గర్భిణులు తప్పనిసరిగా ప్రభుత్వ వైద్యుల సేవలను పొందాలన్నారు. ఇకపోతే బాల్యవివాహాలను నిరోధించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వసతి గృహం తనిఖీ

బ్రహ్మసముద్రం : స్థానిక ఎస్సీ వసతి గృహాన్ని శుక్రవారం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి దామోదర్‌రెడ్డి సందర్శించి విద్యార్థులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఉదయమే హాస్టల్‌కు వచ్చిన ఆయన అల్పాహారం(పొంగల్, చట్నీ) విద్యార్థులతో కలిసి తిని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే తాగునీరు, పరిశుభ్రత, పచ్చదనం, తదితర మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ముఖా ముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భవనం కారుతోందని, తాగునీటి సమస్య ఉందని విద్యార్థులు తెలుపగా త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. హాస్టల్‌లో 185 అడ్మిషన్లు ఉండగా 160 మంది హాజరయ్యారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ రాత్రివేళ దోమతెరలు వాడాలని, చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట వసతి గృహం అధికారి శ్రీనివాసులు, కళ్యాణదుర్గం-2 హాస్టల్ వార్డెన్ సురాంజనేయులు, వాచ్‌మెన్ ప్రభాకర, కమాటి గోవిందప్ప, కుక్కర్ చౌడన్న ఉన్నారు.

'ఎల్ఐసి' చెల్లింపులకు డిజిటల్ సేవలు

రాయదుర్గం : పట్టణంలోని భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసి) కార్యాలయంలో పాలసీదారుల సౌకర్యార్థం శుక్రవారం నుంచి డిజిటల్ విధానంలో ప్రీమియంల చెల్లింపు సేవలను ప్రారంభించినట్లు సీనియర్ బ్రాంచ్ మేనేజర్ జె.లక్ష్మణనాయక్ తెలిపారు. పాలసీదారులు క్రెడిట్, డెబిట్ కార్డ్‌లతో యుపిఐ విధానంలో, క్యు ఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ప్రీమియం చెల్లించవచ్చు అన్నారు. కొత్త పాలసీ ప్రీమియం చెల్లింపునకు వీలు కాదన్నారు.

ఎస్పీని కలిసిన జర్నలిస్టు సంఘం నాయకులు

అనంతపురం : ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ జగదీష్‌ను జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జీవన్‌కుమార్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాప్ సెక్రటరీ నాగరాజు, కమిటీ సభ్యులు శివశంకర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళి

టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని జెఎన్ టియులోని పరిపాలన భవనంలో శుక్రవారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శన్‌రావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలో పోలీసుల తుపాకీకి ఎదురు నిలిచి దమ్ముంటే కాల్చండంటూ సవాల్ విసిరిన ధీరోదాత్తుడు అని కొనియాడారు. అంతేగాకుండా భారత రాజకీయవేత్తగా, స్వాతంత్ర్య సమరయోధుడుగా, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా జాతికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి ఎన్.దేవన్న, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, డైరెక్టర్లు వైశాలి ఘోర్పడే, పి.సుజాత, నాగప్రసాద్ నాయుడు, బి.ఈశ్వర్‌రెడ్డి, పద్మసువర్ణ, విబి.చిత్ర, ఎన్.విశాలి, ఎపి.శివకుమార్, కళ్యాణి రాధా, బి. ఓంప్రకాశ్, మాజీ ఆచార్యులు వి.శంకర్, జోజిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్లు దుర్గాప్రసాద్, రంగానాయక్, నాగభూషణం, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం క్రైం : దేశ ప్రజల కోసం నిరంతరం శ్రమించిన యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని ఎస్పీ పి.జగదీష్ కొనియాడారు. ఆంధ్రరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ డివి.రమణమూర్తి, అనంతపురం, కళ్యాణదుర్గం డీఎస్పీలు టివివి ప్రతాప్, రవికుమార్, సి.ఐలు ధరణీకిశోర్, కనుమూరి సాయినాథ్, శ్రీకాంత్, ప్రతాప్‌రెడ్డి, ఆర్ఐలు రాముడు, మధు, డిపిఒ సూపరింటెండెంట్లు ప్రసాద్, సావిత్రమ్మ, జిల్లా పోలీస్ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షులు గోపీ, రమణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ఐ జాఫర్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, లక్ష్మీనారాయణ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్ : స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి, ప్రోగ్రాం అధికారులు సుజాత, యుగంధర్, అనుపమ, నారాయణస్వామి, రవిశంకర్, ఎఒ గిరిజా మనోహర్, మలేరియా అధికారి ఓబులు, మహమ్మద్ రఫీ, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పేదరికంలో పుట్టి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన ప్రకాశం పంతులు సేవలు మరువలేనివన్నారు. ముఖ్యంగా స్వాతంత్ర సమరయోధునిగా ఆయన సేవలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహమ్మద్‌వసీం, కమిషనర్ పివిఎస్.మూర్తి, డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డి, ఆధరణ పథకం హరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్ సూర్యనారాయణ, కార్పొరేటర్లు బాలాంజనేయులు, కమల్‌భూషణ్, అబుసాలెహా, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : నగరంలోని జిల్లా గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, సిబ్బంది ఇంతియాజ్ అహ్మద్, రామంజినమ్మ, మల్లికార్జున, నాగమణి, ఉజ్జినేశ్వరి, సరస్వతమ్మ, గంగాధర్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ రామచంద్ర, పాఠకులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై పోస్టర్ విడుదల

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

రాయదుర్గం : గుమ్మగట్ట వెలుగు కార్యాలయంలో శుక్రవారం అధికారులు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు డాక్టర్ బాలాజీనాయక్, వెలుగు సిసి కులశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, రాయదుర్గంలోని మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ, వెలుగు సంస్థలు సంయుక్తంగా ఎయిడ్స్‌పై ఏర్పాటుచేసిన సదస్సులో 'మీకు తెలుసా! హెచ్ఐవి/ఎయిడ్స్' పోస్టర్లను విడుదల చేశారు. హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధులు, క్షయపై మహిళా పొదుపు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సచివాలయం, ఐసిడిఎస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. సదస్సులో మాస్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, అకౌంటెంట్ లోకేష్, పిహెచ్‌సి సిబ్బంది మాధవరెడ్డి, మణిమాల, వీఆర్వో ముకుంద, వెలుగు, వైద్య ఆరోగ్యశాఖ, సచివాలయ, ఐసిడిఎస్, మాస్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ అవుట్ రీచ్ వర్కర్స్, పీర్ ఎడ్యుకేటర్స్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో నాణ్యమైన భోజనం అందించండి

కుందుర్పి : హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డాక్టర్ అనూషదేవి ఆదేవించారు. ఆమె శుక్రవారం స్థానిక ఎంజెపిఎపి హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు తెలిపారు. అనంతరం ఆమె విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు వడ్డించిన భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆమె వెంట హాస్టల్ అధికారి శ్రీనివాసులు, ఎఎన్ఎంలు సుధాలక్ష్మి, విశ్వేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కండిషన్ లేని బడి బస్సులపై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గం : పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కండిషన్ లేని బడి బస్సులు నడుపుతున్న ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో ఎంఇఒ విశ్వనాథరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రయివేటు పాఠశాలలు కండిషన్ లేని బస్సులు, లైసెన్స్, అనుభవం లేని డ్రైవర్లతో బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి పాఠశాలల యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జిల్లా పరిషత్‌కి మంచిపేరు తీసుకురావాలి

ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

పదోన్నతుల ఉత్తర్వులను అందజేస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

జిల్లా పరిషత్ కి మంచిపేరు తీసుకురావాలని పదోన్నతి పొందిన ఉద్యోగులకు జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని ఛైర్ పర్సన్ క్యాంపు కార్యాలయంలో జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం క్రింద ఎంపిపి, పెద్దవడుగూరు లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.శేషా రెడ్డి, శెట్టూరు ఎంపిపి, ఎం.పి.పి గుత్తి లో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న బి.భాను రేఖకు ఎం.పి.పి పెనుకొండ కి పరిపాలనాధికారులుగా నియమిస్తూ, పదోన్నతుల ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా గిరిజమ్మ మాట్లాడుతూ. పదోన్నతి పొందిన ఉద్యోగులు జిల్లా ప్రజా పరిషత్ కు మంచి పేరు తీసుకువచ్చేలా మరింత భాధ్యతగా ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిణి సి.ఓబులమ్మ, ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ నియామకంపై పునరాలోచించాలి

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు

రాయదుర్గం : గతంలో రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా పని చేసి బదిలీపై మరో ప్రాంతానికి వెళ్లి తిరిగి ఇక్కడికే కమిషనర్‌గా వస్తున్న దివాకర్‌రెడ్డి నియామకంపై పునరాలోచించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న దివాకర్‌రెడ్డిని రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా తిరిగి నియమించడం ద్వారా గతంలో వలే టిడిపి ప్రభుత్వం కూడా అవినీతికి కొమ్ముకాస్తుందా అని ప్రశ్నించారు. దివాకర్‌రెడ్డి గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పని చేసినప్పుడు అక్రమ లేఅవుట్లు, కార్మికులు, ఉద్యోగుల నుంచి అవినీతి ఆరోపణలను ఎదుర్కొన్నారన్నారు. ఇలాంటి వ్యక్తిని నియమించడం ద్వారా సామాన్య ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా దివాకర్‌రెడ్డి నియామకంపై పునరాలోచించాలని, లేనిపక్షంలో ఆయనకు వ్యతిరేకంగా బీఎస్పీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని నాగరాజు హెచ్చరించారు.

సిఎన్‌సి కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 30వ తేదీ నుంచి కొత్తగా కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ ప్రోగ్రామింగ్(సిఎన్‌సి) కోర్సును ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు ఐటిఐ, ఇంటర్, డిప్లొమో, బీటెక్ చదివిన వారు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఎపి స్టేట్ టెక్నికల్ బోర్డ్ నుంచి సర్టిఫికెట్ జారీ చేస్తారన్నారు. వివరాలకు 98984 00832లో సంప్రదించాలన్నారు.